




# కొంటె ప్రశ్నలడిగేవారిపై పన్నీరు 'ఫన్'నీరు

తామునిగింది గంగ, తావలచింది రంభ అంటారు. అసలు గంగకీ, రంభకీ సంబంధం ఏమిటండీ..?

*అతి అయితే రెండూ ఉప 'ద్రవ' పదార్థాలే..!*

తెలుగు సినిమాల్లో తెలుగమ్మాయిలు హీరోయిన్లయ్యే రోజు వస్తుందంటారా?

*ఆంధ్ర దేశంలో తెలుగు అంతరించినప్పుడు ఆ అవకాశం రావొచ్చు..!*

మిమ్మల్ని సెన్సారు బోర్డు ఛైర్మన్ ని చేస్తే ఎలాంటి మార్పులు తెస్తారు?

*సెన్సారు బోర్డు మెంబర్లకి ఉన్న అవకాశాలన్నీ సకలజనులకీ కలిపిస్తాను.*

ఆంధ్ర దేశాన్ని ముంచెత్తిన భారీ వర్షాలు జలయజ్ఞం ఫలితమేనంటారా?

*'ముంచడం' వరకూ జలయజ్ఞం ఫలితమే.!*

'అప్పుచేయని వాడు దున్నపోతై పుట్టున్..' అంటున్నాడు మా మిత్రుడు అప్పారావు..మరి మీరేమంటారు?

*అప్పులు ఎక్కువైనా , తిట్లవర్షానికి చలించకుండా ఉండేందుకు దున్నపోతులానే ఉండాల్సి వస్తుందని మీ అప్పారావుగారికి నామాటగా చెప్పండి.*

ఊరందరిదీ ఒకదారైతే 'ఉలిపి కట్టె' దొక దారి అంటారు..అసలు ఉలిపికట్టె అంటే ఏమిటి మాస్టారూ..?

*ఈ విషయంలో ఐతే వై ఎస్సూ, చంద్రబాబూ ఇద్దరూ ఉలిపికట్టెలే..*

అరవయ్యేళ్ళ మన స్వాతంత్ర్యాన్ని ఒక్క వాక్యంలో సమీక్షించగలరా?

*షష్టి పూర్తే కానీ ఇష్టపూర్తి కాలేదింకా..*

అప్పిచ్చు వాడు వైద్యుడు అన్నారు పెద్దలు ...మీ డాక్టర్ గారి వద్ద మీరెప్పుడైనా అప్పు తీసుకున్నారా?

*డాక్టర్ గారి ‘ఋణం’ ఎప్పటికీ తీర్చుకోలేము కదా..ఇంకా వేరే అప్పుచేయడం ఎందుకూ.!?*

హేమమాలిని తీసే సినిమాలో లాలూ ప్రసాద్ యాదవ్ వేషం వేస్తున్నారట. అది ఎలాంటి వేషం ఐఉంటుందో ఊహించగలరా?

*ఏ పాత్రైనా ‘లాలిం’చేది గానే ఉంటుంది.*

ఓబులాపురం గనులు ఎవరి జేబుల్లోకి వెళ్తాయుంటారు?

*‘గాలి’ పంచుకునే వాళ్ళ జేబుల్లోకి..!*

---

చిలిపి ప్రశ్నలకి హాస్యబ్రహ్మ, హాస్యావధాని శంకరనారాయణగారి నుంచీ కొంటె సమాధానాలు తెలుసుకోవాలని ఉందా!? ఇంకా ఆలశ్యమెందుకు.. మీ చిలిపి ప్రశ్నల్ని **editor@koumudi.net** కి వెంటనే పంపించండి..!!